క్లుప్తంగా

దివ్యాంగులను ప్రోత్సహించాలి



దివ్యాంగ చిన్నారులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య

కర్నూలు (టౌన్) :దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు క్రీడా పోటీలు, ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్, మండల విద్యా శాఖాధికారులు వినోద్, వనజ, విలీన విద్యా సమన్వయకర్త సాయిరాం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

18న ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 18వ తేదీన ఎమ్మిగనూరులో నిర్వహించే ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, నాయకులు పి.రామకృష్ణారెడ్డి, పుల్లన్న, చంటి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు, క్రీడా సామగ్రి ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఆడుదాం–ఆంధ్ర క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచితంగా దుస్తులు, క్రీడా సామగ్రి, రవాణా చార్జీలను ప్రభుత్వమే భరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడా స్టేడియాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకుల రాఘువేంద్ర, హుస్సేన్‌బాషా, వీరేష్, శిరీష, ప్రకాష్, రంగప్ప పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

కర్నూలు సిటీ: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెట్కూరు సీఈఓ పీవీ రమణ, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దారు ధనుంజయలు అన్నారు. శుక్రవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో ఓటరు నమోదుపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇందు కోసం శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఓటరు నమోదు పోస్టర్లను ఆవిష్కరించారు.

రైతు సమస్యలపై చర్చిస్తాం

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 15 నుంచి మూడు రోజులపాటు కర్నూలులో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కార్మిక, కర్షక బవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సాయిబాబా, కె.ప్రభాకర్, హుస్సేన్, వలి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

కల్లూరు: జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టేలా అవగాహన కల్పించాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సౌకర్యాల కల్పనకు కృషి

కర్నూలు (రాజ్‌విహార్) : ప్రార్థన స్థలాల్లో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం 6వ వార్డు ఉస్తాద్ నగర్‌లో కొత్తగా నిర్మించిన మసీదు ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అక్కడ జుమ్మా నమాజు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఉస్తాద్ మహబూబ్ వలి, హకీం, హఫీజ్ మన్సూర్, నూరుల్లా ఖాద్రి పాల్గొన్నారు.

28,342 మందికి పెన్షన్



గురురాఘవేంద్ర నగర్‌లో చిన్నారికి దివ్యాంగ పెన్షన్ ఇస్తున్న వలంటీర్ రాజశేఖర్

కర్నూలు (టౌన్) : నగర పాలక సంస్థ పరిధిలో వైఎస్ఆర్ పెన్షన్‌కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం ముమ్మరంగా సాగింది. ఉదయం 7 గంటల నుంచే అర్హులైన పెన్షన్ దారుల ఇంటింటికి వెళ్లి వలంటీర్లు పెన్షన్ పంపిణీ చేశారు. నగరంలో మొత్తం 33, 841 పెన్షన్లు ఉన్నాయి. తొలి రోజు 28, 342 మందికి రూ.7, 97, 44,500 పంపిణీ చేసినట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు.

చెంతకే ప్రభుత్వ సేవలు

- ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



లక్ష్మీనగర్‌లో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు (రాజ్‌విహార్): సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు తీసుకెళ్లారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం 24వ వార్డు లక్ష్మీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. పనులు వదులుకొని అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చేరుస్తున్నారని చెప్పారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హుల్లో ఎవరికైనా సంక్షేమ ఫలాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ ఆసీఫ్, రాజు, సునిల్, సుచరిత, అర్చన, అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ రావాలి



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కేదార్‌నాథ్, మాజీ మేయర్ బంగి అనంతయ్య

రాష్ట్రంలో పేదల కష్టాలు తెలిసిన జగనన్నే ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు క్లస్టర్–2 అధ్యక్షుడు కేదార్‌నాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక కిందిగేరిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి ఆ కాలనీలో వివిధ పథకాల కింద ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బంగి అనంతయ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, సూర్యుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక 6 వ వార్డు పరిధిలోని గరీబ్ నగర్ యసీద్ మసీద్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. త్వరలో ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు హకీమ్, వస్తాద్ మెహబాబు ఆలీ, మద్దయ్య, మాబాషా, షకీల్ వస్‌టౌస్ సీఐ తదితరులు పాల్గొన్నారు.



విఠల్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అభివృద్ధికి పెద్దపీట

- సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: నగరంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 26వ వార్డు విఠల్‌నగర్‌లో రూ. 40లక్షల వ్యయంతో సీసీ రోడ్డు చేపడుతున్నారు. ఈ పనులకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని అతిథిగా హాజరై మాట్లాడారు. కల్లూరు అర్బన్ పరిధి రోజురోజుకు విస్తరిస్తుందన్నారు. నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి వార్డుల్లో మౌలిక వసతులు కలిప్తున్నామన్నారు. కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, అవసరమైన చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత పాలకులు పట్టించుకోకపోవడంతో నగరం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రగతి పనులు ఊపందుకున్నాయన్నారు. అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రజలు గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనకు గల తేడాను గమనించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, సాయి, తిరుపాల్, బ్రహ్మానందారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

కర్నూలు కల్చరల్: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం, పరిసర ప్రాంతాల్లో నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యోగులతో కలిసి చైర్మన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశంతో గత రెండు సంవత్సరాలుగా ప్రతి నెలా జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి పెద్దక్క, లైబ్రేరియన్లు కృష్ణారెడ్డి, కవితాబాయి, రాధాబాయి, రవీంద్రరెడ్డి, హరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, ఉద్యోగులు

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(హాస్పిటల్): దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి డ్రైవర్ల అభ్యున్నతికి పాటుపడదామని సౌత్, వెస్ట్ జోన్ రాష్ట్రాల అధ్యక్షుడు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పంజాబ్‌లోని వాఘా జిల్లాలో ఆలిండియా ప్రభుత్వ వాహన డ్రైవర్ల అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సందీప్ మౌర్య(ఉత్తరాఖండ్), సెక్రటరీ జనరల్ విజయరామ్(న్యూఢిల్లీ), పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్వీందర్ సింగ్‌గిల్, కులుమనాలి సులేరామ్, ముఖ్యసలహాదారుడు మినరాజ్(నాగాలాండ్), అన్ని రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో సౌత్ వెస్ట్ జోన్ అధ్యక్షుడు, కర్నూలు అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ అద్దె వాహనాలు రద్దు చేసి, వాటి స్థానంలో ప్రభుత్వం వాహనాలు కొనుగోలు చేసి ప్రభుత్వ డ్రైవర్లను వినియోగించాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లను నిర్లక్ష్యం చేయకూడదని, వారి అభ్యున్నతికి పాటుపడాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 28, 29వ తేదీల్లో ఢిల్లీలో ధర్నా నిర్వహించాలని తీర్మానం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

టీవీ మెకానిక్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా మధుసూదనరెడ్డి



మధుసూదనరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కోడుమూరు యూనియన్ నాయకులు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టీవీ మెకానిక్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.మధుసూదన రెడ్డి (కర్నూలు జిల్లా) ఎన్నికయ్యారు. విజయవాడలో సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 127 మంది ఓటర్లు అధ్యక్ష పదవిలో ఉన్న మధుసూదనరెడికి 51, ఒంగోలు జిల్లాకు చెందిన మహబుబ్ బాషాకు 35, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొండవీటి శ్రీహరికి 34, విజవాయడకు చెందిన శేఖర్‌కు 7 మంది ఓటు వేశారు. అత్యధిక ఓట్లు పోలైన మధుసూదన రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికల అధికారి రవీంద్రరావు ప్రకటించారు. అధ్యక్షునితో పాటు ఉపాధ్యక్షులుగా గుర్గాప్రసాద్ (పశ్చిమ గోదావరి జిల్లా), కార్యదర్శిగా బాలాజి (విజయనగరం జిల్లా), జాయింట్ సెక్రటరీగా హరికిషోర్ (కడప జిల్లా), కోశాధికారిగా రామకృష్ణ (నంద్యాల జిల్లా) ఎన్నికయ్యారు. వీరితో పాటు 26 జిల్లాల నుంచి 26వ మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడిని రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. టీవీ మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తానని మధుసూదన రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



వైఎస్ఆర్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

కర్నూలు సిటీ: వైఎస్ జగనన్నతోనే సామాజిక న్యాయం సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. నగరపాలక పరిధిలోని 38వ వార్డు స్టాంటన్‌పురం విజయ్‌నగర్ కాలనీకి చెందిన 30 రజక కుటుంబాలు శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కార్పొరేటర్ గిబ్సన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధాకర్ సమక్షంలో ఆ కుటుంబాలు పార్టీ కండువా కప్పుకున్నాయి. ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అంశంలోనూ బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో అధిక శాతం పదవులు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి దక్కేవన్నారు. ప్రస్తుతం జగనన్న సామాజిక న్యాయం పాటిస్తున్నారని చెప్పారు. జనసేన నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరిన చేరిన హసీనా మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. వైఎస్ జగన్ పారదర్శక పాలనకు ఆకర్షితులై తాము వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌కు అండగా నిలబడతామన్నారు. పార్టీలో చేరిన వారిలో మహేష్, రాజు(మెడికవర్), సి.నాగరాజు, సి.బజారి, సిద్ధు ఉన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల కన్వీనర్ మహబూబ్ బాషా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సి.బెళగల్ జెడ్పీటీసీ గిరి జోన్, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

కర్నూలు : జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ఉపాధ్యక్షుడు రమణకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధి బృందం రవాణా శాఖ కార్యాలయంలో ఆర్‌టీఓ రమేష్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించింది. కర్నూలు శివారులో ఉన్న కేవీ సుబ్బారెడ్డి, అశోక, బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు నారాయణ, చైతన్య, భాష్యం, అథెనా, మాంటిస్సోరి, ఎడిఫై, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి బస్సులు ప్రమాణాలు పాటించకుండా నడుపుతున్నారని, వాటిపై విచారణ జరిపి సీజ్ చేయాలని ఆర్‌టీఓకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. సంఘం నాయకులు దాము, వీరేష్, రవి, నగేష్ తదితరులు ఆర్‌టీఓను కలసినవారిలో ఉన్నారు.

స్పోర్ట్స్

3న హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

కర్నూలు (టౌన్): ఈనెల 3 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి రుద్రా రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008 సంవత్సరం తరువాత పుట్టిన వారు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికయిన వారు ఈనెల 8 న గుంటూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ వెంట వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 94402-22232 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఈ రోజు

జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): గ్రంథాలయ మాజీ చైర్మన్ గంగాధర్‌రెడ్డి, సుశీల నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం జర్నలిస్టుల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కంటి వైద్య నిపుణుడు సుధాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాచార శాఖభవన్ దగ్గర ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని కంటి వ్యాధులతో బాధపడే జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరం అయిన వారికి ఉచితంగా కంటి అద్దాలతోపాటు ఆపరేషన్లు చేస్తామని ఆయన తెలిపారు.

కార్తీక మహోత్సవం

కర్నూలు కల్చరల్: పర్యాటక, అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం కార్తీక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. గార్గేయపురం సమీపంలోని నగర వనంలో ఉదయం 10 గంటలకు కార్తీక వన భోజనాలు ఆరగిస్తూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండుగలా వీక్షించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారులు కుటుంబ సమేతంగా వేడుకలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయ మనోహరి



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(రాజ్‌విహార్):ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. శుక్రవారం స్థానిక 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి.. ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ చెప్పిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల కష్టం తెలిసిన నాయకుడు వైఎస్ జగన్ అని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేర్చుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునెమ్మ, వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



కల్లూరు అర్బన్ 20వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: అర్హులైన వారందరికీ ప్రభుత్వం సంక్షేమఫలాలు అందజేస్తుందని కల్లూరు అర్బన్ క్లస్టర్–2 కన్వీనర్, కార్పొరేటర్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ''ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనన్నే కావాలి ' మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. 89వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించా రు.ఇంటింటికి తిరుగుతూ నాలుగున్నరేళ్ల కా లంలో అందించిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురి, నాయకులు వీరయ్య, మిద్దూరు శ్రీనివా సులు, సుధాకర్‌రెడ్డి, హనుమంతయ్య, కృష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

- 20వ వార్డు స్థానిక శ్రీనగర్ కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, క్లస్టర్–1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి హాజరై వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాలను తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- మండల పరిధిలోని పర్ల గ్రామంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాలను తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు.

సంక్షిప్తం

రేపు కుర్ని కులస్తుల కార్తీక వన భోజనం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 3వ తేదీ ఆదివారం వెంగన్నబావి వద్ద కుర్ని (నేసె) కులస్తుల కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

దళితులు, మైనార్టీలకు ప్రాధాన్యం

కర్నూలు (సెంట్రల్) : తమ పార్టీదళితులు, మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తుందని డీసీసీ అధ్యక్షుడు బాబు రావు అన్నారు. శుక్రవారం ఆయనను జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్, జిల్లా మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.సుధాకర్ బాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్‌సీహెచ్ బజారన్న, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ నూర్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

3న తెలుగు సారస్వత వైభవం ప్రారంభం

కర్నూలు కల్చరల్: తెలుగు సారస్వత వైభవం సాహితీ సంస్థను ఈనెల 3వ తేదీన ప్రారంభిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కేవీఆర్ కళాశాలలో ఆ సంస్థ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి బురుజు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు దండెబోయిన పార్వతీ దేవి, నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, అధ్యాపకురాలు లత, జయ సూర్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు భవసార క్షత్రియుల కార్తీక వనభోజనం

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో ఉన్న హింగులాజ్ మాత దేవాలయం వద్ద ఆదివారం భవసార క్షత్రియుల కార్తీక మాస వనభోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నింకర్ శివశంకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

గురు శిష్య పరంపరకు ఎంపిక

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురు శిష్య పరంపర అనే కార్యక్రమం టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. పౌరాణిక నాటక రంగాన్ని ప్రోత్సహించడం కోసం ఈ పథకం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పద్య నాటకంలో ఆసక్తి ఉన్న యువత సీక్యాంప్‌లోని తమ కళాక్షేత్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

యువకుడు అదృశ్యం

కర్నూలు (అగ్రికల్చర్) : స్థానిక ప్రకాష్ నగర్‌కు చెందిన మొస్లెం సర్కార్ (19) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మల్దార్ జిల్లాకు చెందిన సర్కార్ సంజయ్ ఖాన్ అనే వ్యక్తి తన కుటుంబంతో సహా పదేళ్లుగా కర్నూలులో నివసిస్తున్నాడు. ఈయన ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడు మొస్లెం సర్కార్ గతనెల 24వ తేదీ ఉదయం 8:20 గంటలకు పాల కోసమని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు టూటౌన్ పోలీసులకు లేదా 9564853854 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రెండు లారీలు సీజ్

కర్నూలు (న్యూటౌన్): తాడిపత్రి నుంచి ప్రకాశం జిల్లాకు అక్రమంగా గ్రానెట్ తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం తాడిపత్రి సమీపంలో గ్రానెట్‌ను అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారంతో దాడి చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ డీడీ మాట్లాడుతూ తాడిపత్రి నుంచి ప్రకాశం జిల్లాకు అక్రమంగా గ్రానెట్‌ను తరలిస్తున్న ఏపీ 27యూటీ 4757, ఏపీ 02టీఈ 5779 రెండు లారీలను సీజ్ చేసి కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పామని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, రాయల్టీ చెల్లించకుండా అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.